క్లుప్తంగా

నస్రుల్లాబాద్ ఎంపీడీవోగా రవీశ్వర్ గౌడ్



నస్రుల్లాబాద్: మండల ఎంపీడీవోగా రవీశ్వర్ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం నస్రుల్లాబాద్ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన సూర్యకాంత్ బదిలీపై జిల్లా కార్యాలయానికి వెళ్లారు. ఆయన స్థానంలో మెదక్ జిల్లా నుంచి రవీశ్వర్ గౌడ్ వచ్చారు.

నేడు లింగంపేటకు ఎమ్మెల్యే రాక

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి శుక్రవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ తెలిపారు. ఆయన నియోజకవర్గ స్థాయి మహిళా శక్తి సంబురాల్లో పాల్గొననున్నట్లు ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. అలాగే మండల కేంద్రంలోని పెద్దవాగు వద్ద వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటుతారని మెంగారం సెక్షన్ అధికారి భాస్కర్ తెలిపారు.

మాజీ ప్రిన్సిపాల్‌కు అవార్డు ప్రదానం



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ మాజీ ప్రిన్సిపాల్, జియో ఇన్ఫర్‌మేటిక్స్ హెచ్‌వోడీ కవితా తోరస్‌కు ముంబాయి ఐఐటీలో గురువారం అవార్డును ప్రదానం చేశారు. జాతీయ భౌగోళిక కంప్యూటర్ సైన్స్ టెక్నికల్ జియోగ్రఫీ డొమైన్‌ల బోధనలో కవితా తోరస్ చూపుతున్న ప్రతిభను గుర్తించిన ముంబాయి ఐఐటీ వారు ఆమెను జాతీయ ఎమర్జింగ్ ఫ్యాకల్టీ ఫెలో అవార్డు –2025ను ప్రదానం చేసి సత్కరించారు. ఐఐటీ డైరెక్టర్ కిరణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ కన్నన్ పాల్గొన్నారు.

గోల్డ్ మెడలిస్టుకు సన్మానం



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు శ్రావణిని గురువారం సన్మానించారు. శ్రావణి ఎంఏ తెలుగులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ విషయమై ఆమెను పాఠశాలలో సత్కరించారు. హెచ్‌ఎం దయానంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోర్‌బావిని తవ్వించిన వ్యక్తికి..

భిక్కనూరు: తిప్పాపూర్‌లో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప సన్నిధానం వద్ద తిరుపతి భీంరెడ్డి అనే వ్యక్తి గురువారం బోర్ బావిని తవ్వించారు. ఈ సందర్భంగా బోర్‌బావిని తవ్వించిన భీంరెడ్డిని అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామానికి చెందిన కండె బొల్లారం వైష్ణవి క్రీడా పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దఫేదార్ వెంకన్న తెలిపారు. ఈ నెల 18న హైద్రాబాద్‌లోని హకీంపేట క్రీడా పాఠ శాలలో చేరనుందని చెప్పారు. క్రీడల పట్ల మక్కువ ఉన్న వైష్ణవి క్రీడా పాఠశాలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పని సరి

నస్రుల్లాబాద్: రైతులందరు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఏఈవో గ్రీష్మ అన్నారు. గురువారం నెమ్లిలో గల రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిర్జాపూర్ క్లస్టర్ పరిధిలో 3,200 మంది రైతులకు 1000 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం సంబంధించిన పథకాలకు అర్హతను కోల్పోతారని, రైతులు వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ వారోత్సవాలు

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మొగా ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూ సభ్యత్వ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ డోంగ్లీ మండల అధ్యక్షుడు సునీల్ 2025 సభ్యత్వ వారోత్సవాల్లో భాగంగా మొగా పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులందరికి సభ్యత్వం అందించారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి మారుతి, ఉపాధ్యాయులు రమేశ్, ప్రకాశ్ తదితరులున్నారు.

కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు

- రెండు చోట్ల నిర్మాణ పనులు
- టెండర్ దశలో ఒక సబ్‌స్టేషన్



మహమ్మద్‌నగర్‌లో పిల్లర్ల దశలో ఉన్న సబ్‌స్టేషన్

నిజాంసాగర్(జుక్కల్): వ్యవసాయరంగానికి నాణ్యమైన కరెంట్ సరఫరాతో పాటు లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు ట్రాన్స్‌కో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు కొత్త సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. జుక్కల్ నియోజకవర్గం పరిధిలో 6 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి, బిచ్కుంద మండలం హస్గుల్, పెద్దకొడప్‌గల్ మండలం కాటేపల్లి, మద్నూర్ మండలం తడ్గూర్, డోంగ్లి మండలం కుర్ల వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు ఆయా మండలాల్లో సబ్‌స్టేషన్ల మంజూరుకు సంబంధించిన ప్రణాళికలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే గౌరారం వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో 139 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా చిట్యాల, మహమ్మద్‌నగర్ మండల కేంద్రాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జిల్లాలో 1.15 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉండగా 2.93 లక్షల కేటగిరి–1 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ వినియోగం రోజురోజుకు అధికం కావడటంతో పాటు వ్యవసాయ కనెక్షన్లు విపరీతంగా పెరుగుతుండటంతో సబ్‌స్టేషన్ల నిర్మాణం అత్యవసరమైంది.

ఆగుతూ..సాగుతున్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఆ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. పనులకు స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శంకుస్థాపన కూడా చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదిన్నర కావస్తున్నా పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ఆగుతూ, సాగుతుండటంతో కరెంట్ సమస్యకు పరిష్కారం లభించడం లేదని స్థానిక రైతులు, విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. నిర్మాణ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారు. చిట్యాల వద్ద సబ్ స్టేషన్ నిర్మాణ పనులు కూడా అలానే కొనసాగుతున్నాయి. బాన్సువాడ మండలం బోర్లం వద్ద సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో టెండర్ దశకు చేరుకుంది. టెండర్ల ప్రక్రియ చేపట్టి, సబ్ స్టేషన్ నిర్మాణనికి శ్రీకారం చుట్టనున్నారు.

కరెంట్ సమస్య తలెత్తకుండా చర్యలు

వ్యవసాయంతో పాటు గృహ అవసరాలకు కరెంట్ సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు కట్టిన రైతులకు విడతల వారీగా ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేస్తున్నాం. జుక్కల్ నియోజకవర్గంలో కొత్త సబ్ స్టేషన్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– శ్రావణ్‌కుమార్, జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈ

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



కళాశాలలో అవగహన కల్పిస్తున్న కళాబృందం

మద్నూర్(జుక్కల్): సైబర్ నేరాలను ముందుగానే పసిగట్టి అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాబృందం సభ్యులు సూచించారు. మండల కేంద్రంలోని రాంసుఖ్ బాల్‌ముకుంద్ ఇనాని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై తిరుపతి కళాబృందం, షీటీమ్ బాన్సువాడ డివిజన్ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ఎస్సై విజయ్‌కొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత సైబర్ నేరాలను గుర్తించాలని ఇంట్లో తల్లిదండ్రులకు, అక్కచెల్లెళ్లకు అవగాహన కల్పించాలన్నారు. మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే 100 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. కళాశాల అభివృద్ధికి ఏఏపీసీ కమిటీని ఎన్నుకున్నట్లు ప్రిన్స్‌పాల్ పాండురంగ్ తెలిపారు. ఏఏపీసీ కన్వీనర్‌గా పాండురంగ్, కమిటీ అధ్యక్షులుగా ప్రేమల, కమిటీ సభ్యులను ఎనుకున్నట్లు వారు తెలిపారు.

విద్యుత్ సబ్ స్టేషన్ పనుల పరిశీలన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని చిట్యాలలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ పనులను గురువారం విద్యుత్ ఎస్‌ఈ శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిర్మాణ పనులను త్వరగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సబ్‌స్టేషన్ పనులు పూర్తయితే చిట్యాలతో పాటు మరో ఐదు గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట ఏడీఈ కిరణచైతన్య, సిబ్బంది తదితరులున్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

బిచ్కుంద(జుక్కల్): మొక్కలతోనే మానవ మనుగడ ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. పుల్కల్ పాఠశాలలో గురువారం ఎఫ్ఎస్‌వో సంతోష్‌రెడ్డి, ఎఫ్‌బీవో శ్రీనివాస్ వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వన మహోత్సవ ఆవశ్యకతను వారు విద్యార్థులకు వివరించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌కుమార్, నాగభూషణం, తదితరులు ఉన్నారు.

పులి కాదు నక్క..

- అన్నారం ఘటనపై అటవీశాఖ అధికారుల క్లారిటీ

రామారెడ్డి: మండలంలో పులి అలజడి మరోసారి కలకలం రేపింది. ఐదు రోజుల క్రితం స్కూల్ తండా సమీపంలో పులి సంచరిస్తోందనే సమాచారంతో అటవీ శాఖ అధికారులు దాని ఆచూకీ కోసం రాత్రి పగలు వెతుకుతున్నారు. తాజాగా గురువారం రాత్రి 12 తర్వాత అన్నారం గ్రామంలో కుక్కలు అదేపనిగా అరవడంతో గ్రామానికి చెందిన వీరబైన రాజేందర్ అనే వ్యక్తి బయటకు వచ్చి టార్చ్ లైట్ వేసి చూడగా గుర్తుతెలియని జంతువు కనిపించినట్లుగా ఫిర్యాదు చేశాడు. ఆ గ్రామ వాట్సాప్ గ్రూపులో గ్రామంలో పులి తిరుగుతుంది జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు వాట్సఅప్ మెసేజ్ చేశాడు. రాత్రి ఘటన స్థలానికి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు చేరుకొని అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారులు విచారణ చేసి అది పులి కాదని నక్క అని నిర్ధారించారు. స్కూల్ తండా, జగదాంబ తండా, బట్టు తండా అడవి ప్రాంతంలోనే పులి సంచారం ఉండడంతో గ్రామస్తులు వీడీసీ సభ్యులు అన్నారం గ్రామంలో పులి సంచారం ఉందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డప్పు చాటింపు వేశారు.

భయం గుప్పిట అన్నారం గ్రామస్తులు..

ఆరు రోజులుగా మండలంలో పులి సంచారం ప్రజలను అధికారులను కంటికి కునుకు లేకుండా చేస్తుంది. తాజాగా అన్నారంలో వాట్సాప్ గ్రూపులో డప్పు చాటింపుతో పులి సంచారంపై ప్రచారం చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మాచారెడ్డి ఎఫ్ఆర్‌వో దివ్య మాట్లాడుతూ.. అన్నారంలో గురువారం రాత్రి కనిపించిన జంతువు నక్క అని పులి కాదని ప్రజలు భయాందోళన గురికావాల్సిన అవసరం లేదని, అటవీ శాఖ అధికారులు పులి ఆచూకీ కోసం ట్రాక్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో రాత్రి పగలు వెతుకుతున్నారని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



రామారెడ్డి ఎంపీడీవో నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



ప్రార్థనలో పాల్గొన్న కాంప్లెక్స్ హెచ్‌ఎం శోభారాణి

దోమకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో విజయ్ కుమార్ అన్నారు. గురువారం సీతారాంపల్లి ప్రభుత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు.

బిల్లులు చెల్లించకపోతే గుడ్లు అందించలేం

రామారెడ్డి: ఆరు నెలల నుంచి గుడ్లకు సంబంధించిన బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యాహ్న భోజనంలో గుడ్లు పెట్టలేమని మధ్యాహ్న భోజన కార్మికులు ఎంపీడీవో నాగేశ్వర్‌కు, ఎంఈవో ఆనంద్‌రావుకు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి మధ్యాహ్న భోజన బిల్లులను సకాలంలో అందించాలని కోరారు.

ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని బాలికల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి సూచించారు. గురువారం ఆమె మండలంలోని అయిలాపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, రాంపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో పాటు ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా బోధన చేయాలన్నారు. హెచ్‌ఎం రాజయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ వైర్లకు పాకిన గడ్డితీగలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ శివారు 44వ జాతీయ రహదారి పక్కన గల విద్యుత్ వైర్లకు పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. జాతీయ రహదారి పక్కన విద్యుత్ వైర్లు సైతం కనిపించకుండా పోయినా కానీ సంబంధిత అధికారులు వాటిని తొలగించడం లేదు. అధికారులు స్పందించి తీగలకు అల్లుకుపోయిన మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ముందుకు కదలని మురికి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): పూర్యా నాయక్ తండాలో మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురికి నీరు రోడ్డుపై పారుతోంది. వర్షాకాలం సమీపించడంతో మురికి కాలువల్లో పేరుకు పోయిన మురికిని తొలగించకపోవడంతో రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ కారణంగా దోమల బెడద పెరిగిపోయింది. అధికారులు దృష్టి సారించి మురికి కాలువలను శుభ్రంగా చేయించాలని, పంచాయితీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే చర్యలు తప్పవు



మద్నూర్(జుక్కల్): రోడ్లపై కేజ్‌వీల్స్ నడపడానికి అనుమతి లేదని, కేజ్‌వీల్స్ నడిపితే చర్యలు తప్పవని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మేనూర్ గ్రామ సమీపంలో రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను గురువారం ఆయన పట్టుకొని వారికి అవగాహన కల్పించారు. కేజ్‌వీల్స్ కేవలం వ్యవసాయ క్షేత్రంలో, మట్టి రోడ్లపై మాత్రమే నడుపుకోవాలని సూచించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్లపై తనిఖీలు నిర్వహిస్తున్నామని అన్నారు.

ఇళ్లను నాణ్యతతో త్వరగా నిర్మించుకోవాలి



బ్రాహ్మణ్‌పల్లిలో ఇందిరమ్మ ఇల్లుని పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి



బస్వాపూర్‌లో.. ఎంపీడీవో శ్రీనివాస్



కొండాపూర్‌లో .. ఎంపీడీవో బాలకృష్ణ

గాంధారి(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో వీలైనంత తొందరగా నిర్మించుకోవాలని ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. గురువారం ఆయన బ్రాహ్మణ్‌పల్లిని ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆరు గ్యారంటీ పథకాల గురించి ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు.

ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం బస్వాపూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్లను గురువారం స్థానిక ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

కొండాపూర్, అర్గొండలలో..

రాజంపేట: కొండాపూర్, అర్గొండ గ్రామాలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఎంపీడీవో బాలకృష్ణ పరిశీలించారు. లబ్ధిదారులు సకాలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీవో రఘురాం, ఏపీవో శృతి, పంచాయతీ కార్యదర్శులు శ్రీజ, లక్ష్మణ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీవో మలహరి సూచించారు. గురువారం ఆయన లింగంపేట మండలంలోని పొల్కంపేటలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యదర్శి అశ్వక్ ఉన్నారు.

పాఠశాలకు ప్యూరిఫైడ్ మిషన్ అందజేత



కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు పొన్నాల సంధ్య తాగు నీటి ప్యూరిఫైడ్ మిషన్‌ను ఉచితంగా అందజేశారు. గురువారం హెచ్‌ఎం అనిల్‌కు అప్పగించారు. మాజీ కౌన్సిలర్ ఆకుల రూప, మాజీ సర్పంచ్ గంగాధర్, సొసైటీ డైరెక్టర్ రాజు నాయకులు రవి, ముల్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొచ్చెరి మైసమ్మ పండుగ



నస్రుల్లాబాద్: మైలారంలో గురువారం కొచ్చెరి మైసమ్మ పండుగను గ్రామస్తులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. 200 ఏళ్ల క్రితం చెరువు గట్టున వెలిసిన అమ్మవారికి ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో బోనం సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. కోరిన కోర్కెలు తీర్చి భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్న అమ్మవారిని కొలవడానికి ఒక్క తెలంగాణ మాత్రమే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలో నిబంధనలను పాటించని ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు గురువారం డీఈవో ఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూళ్లు చేస్తున్నారని, మైదానాలు, సరిపడా బాత్‌రూంలు, మరుగుదొడ్లు, కనీస సౌకర్యాలు లేక స్కూల్‌లను కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సతీష్, పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ ఉన్నారు.

సంక్షిప్తం

వరి పంట పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాటూర్ శివారులో రైతులు సాగు చేస్తున్న వరిపంటను గురువారం స్థానిక ఏవో సాయికిరణ్ పరిశీలించారు. పంటలో ఆకుముడత పురుగు తొలిదశలో ఉన్నట్లు ఆయన గుర్తించారు. నివారణకు 15లీటర్ల నీటిలో 40 ఎంఎల్ క్లోరోపైరీఫాస్ మందును లేదా 15 లీటర్ల నీటిలో 30 ఎంఎల్ ప్రొఫెనోపాస్ మందును కలిపి ఎకరా పంటకు పిచికారీ చేయాలని సూచించారు. దీంతోపాటు వరిపంటలో కలుపు మొక్కల నివారణ కోసం ఫినాక్సులం 1.02, సైహలోపాబుటీ 5.1 మిశ్రమ మందును ఎకరాకు 800 ఎంఎల్ చొప్పున నీటిని తీసివేసి పిచికారీ చేయాలన్నారు. రెండురోజుల వరకు నీటిని పెట్టవద్దని చెప్పారు.

ఎల్లారెడ్డిలో కంటి శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి శిబిరంలో 42 మందికి వైద్యులు హరికిషన్ వైద్య పరీక్షలు చేశారు.

బీసీహాస్టల్‌లో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మత్తమాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

రాజమ్మతండాలో ..

రామారెడ్డి: రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలోని రాజమ్మ తండాలో హెల్త్ క్యాంప్‌ను శుక్రవారం నిర్వహించారు. జ్వరం ఉన్న వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం టి– హబ్(కామారెడ్డి)కి పంపినట్లు వైద్యాధికారి సురేష్ తెలిపారు. ఎంపీడీవో నాగేశ్వర్‌తో కలసి తండాలో నీళ్లు ఆగిన ప్రాంతాలను గుర్తించి తొలగించారు. ఎంపీడీవో నాగేశ్వర్ మాట్లాడుతూ.. దోమ లార్వా నిల్వ ఉండకుండా స్ప్రేలు కొట్టించాలని జీపీ కార్యదర్శి క్రాంతికుమార్‌కు సూచించారు. కార్యదర్శి క్రాంతికుమార్, ఏఎన్‌ఎం లింబమ్మ, ఆశాలు వనిత, మంజుల, ప్రమీల, తండా ప్రజలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపి క్యాంపు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపి వైద్యులు అరుణ్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్నారులకు ప్రతి రోజు ఫిజియోథెరపీకి సంబంధిచిన వ్యాయామాలు చేయించాలని సూచించారు. సిబ్బంది వెంకటేశం, తదితరులున్నారు.

విద్యార్థులకు ఐడీకార్డులు, టై, బెల్ట్‌ల పంపిణీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐడీ కార్డ్స్,టై, బెల్టులను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి , మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి కమలాకర్ రావు, ట్రెజరర్ లింబారెడ్డి, జిల్లా క్యాబినెట్ మెంబర్ గాదారి గంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ప్రతినిధులున్నారు.

చేతులను శుభ్రంగా కడుక్కోవాలి

మాచారెడ్డి: ప్రతి ఒక్కరు భోజనం చేసే సమయంలో తప్పనిసరిగా చేతులను శుభ్రంగా కడుక్కోవాలని మాచారెడ్డి ప్రభుత్వ వైద్యుడు ఆదర్శ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పించారు. చేతి గోర్లు పెరగకుండా శ్రద్ధ వహించాలన్నారు.